నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 30 జూలై 2024 | NIZAMABAD

## నేడు రెండో విడుత రుణమాఫీ




కంఠేశ్వర్/కామారెడ్డి, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ రెండో విడుత నిధులను నేడు (మంగళవారం) ఉదయం 11గంటలకు విడుదల చేయనున్నట్లు నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్ గాంధీ హన్మంతు, ఆశీష్ సంగ్వాన్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రైతులు, అధికారుల సమక్షంలో రెండో విడుత రుణమాఫీ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో రూ.లక్షా50వేల లోపు రుణాలున్న 22,868 మంది రైతులకు రూ.210.54కోట్లు విడుదల చేయనున్నారు.

- అయోమయంలో అన్నదాతలు
- పది రోజులైనా బ్యాంకుకు చేరని జాబితా
- పట్టించుకోని అధికారులు
- కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్న రైతులు



దండిగుట్టలో రుణమాఫీ కాలేదని పాస్‌బుక్కులు చూపిస్తున్న రైతులు

# 900 మంది రైతుల్లో ఒకరికే మాఫీ



**రైతులకు ఏకకాలంలో** రూ.లక్షలోపు రుణమాఫీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పింది. క్షేత్రస్థాయిలో వేలాది మంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదు. రైతులు ఎదురుచూస్తున్న రుణమాఫీలో భాగంగా నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో ఒకరికి మాత్రమే మాఫీ జరిగింది. బ్యాంకులో 1400మంది రైతు ఖాతాదారులుగా ఉండగా, 900మంది రూ.లక్షలోపు పంట రుణం తీసుకున్నారు. కాగా ఒకరికి మాత్రమే రుణమాఫీ రావడంతో రైతులందరూ ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేశామని చెప్పి 10రోజులు గడుస్తున్నా.. జాబితా విషయంలో ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆందోళన చెందుతున్నారు. 1400మంది రైతుల్లో 900మంది రూ.లక్షలోపు రుణం తీసుకోగా, ఆ పైబడి రైతులు రూ.2లక్షల వరకు లోన్ తీసుకున్నారు. తమకెందుకు రుణమాఫీ కాలేదంటూ అధికారులను అడిగినప్పటికీ త్వరలోనే అవుతుందంటూ మాట దాటవేస్తున్నారు. దీంతో రుణమాఫీ అవుతుందో లేదోనని రైతులు టెన్షన్ పడుతున్నారు. అటు వ్యవసాయాధికారులు, ఇటు బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా రుణమాఫీపై ఎలాంటి స్పందన రావడం లేదని రైతులు వాపోతున్నారు. వడ్డీ కడితేనే మాఫీ అని బ్యాంకులు గతంలో చెప్పాయని, దీంతో దిక్కులేని పరిస్థితుల్లో కూడా అప్పు తెచ్చి వడ్డీలు చెల్లించామని, అయినా రుణమాఫీ జాబితాలో పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–ఇందల్వాయి, జూలై 29



## 150రైతుల్లో..20మందికే..

రెంజల్, జూలై 29: రెంజల్ మండలంలోని దండిగుట్ట గ్రామం పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలోపు పంట రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించినా ఈ గ్రామంలో మాత్రం కేవలం 20మందికే మాఫీ అయినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ వరకు సుమారు 150మంది రైతులుండగా 20మందికే మాఫీ వర్తించడంతో ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

### లిస్టులో పేరు రాలేదన్నారు..



నాకు ఎకరం 16గుంటల భూమి ఉన్నది. గతేడాది కెనరా బ్యాంక్‌లో రూ.75వేల పంట రుణం తీసుకున్నా. రూ.లక్షలోపు లోన్ ఉన్న రైతుకు మాఫీ చేస్తున్నట్లు ప్రభు త్వం ప్రకటించడంతో బ్యాంకు వెళ్లాను. బ్యాంక్ అధికారులకు ఖాతా బుక్ చూయించగా రూ.లక్షలోపు లిస్టులో నా పేరు రాలేదని చెప్పారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

**- ముళ్లపూడి కృష్ణారావు, రైతు, దండిగుట్ట**

### 12 కొర్రీలు పెట్టినా మాఫీ కాలేదు



రుణమాఫీ వర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం 12 కొర్రీలు పెట్టినా అర్హులైన వారికి మాఫీ రాలేదు. నా పేరున రెండు ఎకరాల భూ మి ఉన్నది. 2018 సంవత్సరంలో కెనరా బ్యాంక్‌లో రూ.70వేల పంట రుణం తీసుకున్నా. రేవంత్‌రెడ్డి హయాంలో మాఫీ అవుతుందనుకున్న సంతోషం మొదటి విడుతలోనే నీరు గారింది.

**- మల్లవరపు సుజాత, దండిగుట్ట**

## రుణమాఫీ దేవుడెరుగు.. రైతుభరోసాకు దిక్కులేదు



ధర్పల్లి, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకెంతో మేలు చేస్తామని గొప్పలు చెబితే రైతులందరిలాగే నేనూ సంతోషపడ్డా. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకు, పనితీరుకు పొంతన లేకుండా పోయింది. రుణమాఫీ దేవుడెరుగు ఇంతవరకూ రైతు భరోసా కింద ఇస్తామన్న రూ.15వేలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో కేసీఆర్ ప్రభుత్వం జూలై మొదటి వారంలోనే రైతుబంధు డబ్బులు వేసేది. పైసలు ఖాతాలో పడగానే ఫోన్లల్ల మెస్సేజులు వచ్చేవి. గత ప్రభుత్వం అందించినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.10 వేల చొప్పున మొదటి విడుతలో ఎకరానికి రూ.5వేలు కూడా వేయలేదు. నాకు రూ.2లక్షలకు పైగానే పంట రుణం ఉన్నది. నాకు అటు రైతు రుణమాఫీ రాలేదు..ఇటు రైతుభరోసా డబ్బులు రాలేదు. ఇప్పుడు పెట్టుబడికి ఇతరుల వద్ద చేయి చాపాల్సిందే. ఈ ప్రభుత్వం డబ్బులను రైతు రుణమాఫీకి మళ్లించి రైతుభరోసాను ఆలస్యం చేస్తున్నది. దీంతో రైతులందరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత ప్రభుత్వం మాదిరిగా సమయానికి రైతుభరోసా డబ్బులు అందించి ఆదుకోవాలి.

**- సరసాని లక్‌పతి, రైతు, ధర్పల్లి**

### అన్నీ సక్రమంగా ఉన్నా మాఫీ కాలేదు..



బ్యాంకులో తీసుకున్న లోన్‌కు నిబంధనల ప్రకారం అన్నీ సక్రమంగా ఉన్నాయి. అయినా రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడం, లోన్ మాఫీ కాకపోవడం ఆశ్చర్యకరం. ప్రభుత్వం ఎలాగైనా స్పందించి మా గోడును విని సమస్యను పరిష్కరించేలా పైఅధికారులు చర్యలు తీసుకోవాలి.

**- మకీల్ గంగారాజయ్య, రైతు, సిర్నాపల్లి, ఇందల్వాయి**

### తప్పెవరిది..?



ఇండియన్ బ్యాంకులో పంట రుణం తీసుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తున్నదన్న ఆనందంతో నాకున్న రూ.55వేల లోన్ మాఫీ అవుతుందనుకున్న. ఇప్పటికీ మాఫీ కాకపోవడంలో తప్పెవరిదో తెలియడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానిదా? బ్యాంకు అధికారులదా? అనే గందరగోళంలో ఉన్నాను. దాదాపు 900మంది రూ.లక్షలోపు రుణాలున్న రైతులందరికీ తగిన న్యాయం చేయాలి.

**- తలారి సాయిలు, రైతు, సిర్నాపల్లి గ్రామం, ఇందల్వాయి**

### ఒకరికే మాఫీ కావడం ఆశ్చర్యం



దాదాపు 1400మంది రైతులున్న తమ గ్రామంలో ఒకరికే మాఫీ కావడం ఆశ్చర్యమేసింది. ప్రభుత్వం ఏ డాటా ప్రకారం రైతులకు రుణమాఫీ చేసిందో అర్థం కావడం లేదు. తాను తీసుకున్న రుణం మాఫీ అవుతుందన్న ఆనందంలో ఉండగా ఇలాంటి వార్త వినడంతో ఎలా స్పందించాలో తెలియడం లేదు. మా ఊళ్లో చాలా మంది లక్షలోపు రుణాలున్నా.. వారికీ మాఫీ కాలేదు. రైతులకిచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

**-యాచారం చిన్న సాయిలు, సిర్నాపల్లి రైతు, ఇందల్వాయి**

## 23మందికే వర్తింపు..

నందిపేట్, జూలై 29: బాద్గుణ గ్రామంలో సుమారు 250కి పైగా రైతులున్నారు. గ్రామానికి చెందిన 60 మందికిపైగా రైతులు నందిపేట్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాం కు, డొంకేశ్వర్ సొసైటీలో రు ణాలు తీసుకున్నారు. 60మందికి పైగా రూ.లక్ష వరకు రుణం తీసుకున్నారు. ఇటీవల ప్రకటించిన రుణమాఫీ లబ్ధిదారుల జాబితాలో 23 మందికే మాఫీ అయ్యింది. మిగతా రైతులంతా బ్యాంకు, సొసైటీ చుట్టూ తిరుగుతున్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు పేర్లలో తేడాలుండడంతో మాఫీ జరగలేదని అధికారులు చెబుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అర్హులమైనప్పటికీ రుణమాఫీ జరగలేదని, కుంటి సాకులను వదిలి.. మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## రుణమాఫీ కాలే.. న్యాయం చేయాలి

### జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు రైతు ఫిర్యాదు



ఎడపల్లి, జులై 29: రుణమాఫీ విషయంలో తనకు న్యాయం చేయాలంటూ జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్‌కు చెందిన రైతు మాల పెద్దులు ఫిర్యాదు చేశాడు. తన ఫిర్యాదు పత్రాలను సోమవారం స్పీడ్ పోస్టు ద్వారా సంబంధిత కమిషన్‌కు పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడేండ్ల క్రితం తన భార్యతోపాటు తన పేరిట వివిధ బ్యాంకులతోపాటు ఎడపల్లి సొసైటీలో రూ.98వేల పంట రుణం తీసుకున్నానని తెలిపాడు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీలో భాగంగా తాను తీసుకున్న రూ.98వేల రుణమాఫీపై ఎడపల్లి సొసైటీ కార్యదర్శి రాజారాంను అడగగా మాఫీ కాలేదని తెలిపారన్నారు. ఇదే విషయమై మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్‌ను సంప్రదించగా రూ.98వేల రుణం మాఫీ కాలేదని, తన ఖాతా నుంచి సుమారు రూ.లక్షా20 వేల వరకు గట్క చిన్న సాయిలు రుణం పొందినట్టుగా చూపిస్తుందని, దీంతో కావాల్సిన రుణమాఫీ కాలేదని చెప్పినట్లు వివరించారు. ఎడపల్లి సొసైటీ కార్యదర్శి రాజారాం పనితీరుపై అనుమానం వ్యక్తం చేస్తూ తనకు న్యాయం చేయాలంటూ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. అధికారులు రుణమాఫీ చేసి సహకరించాలని, మంగళవారం కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేస్తానని రైతు పేర్కొన్నారు.



భీమ్‌గల్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## పది రోజులైనా పట్టుకోరా?

- ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న బీఆర్‌ఎస్ నేతలపై దాడి
- రోజులు గడుస్తున్నా నిందితులను అరెస్టు చేయని వైనం
- పోలీసుల అలసత్వాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణుల రాస్తారోకో

భీమ్‌గల్, జూలై 29: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న బీఆర్‌ఎస్ నేతలపై దాడికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నేతలు సోమవారం భీమ్‌గల్‌లో రాస్తారోకో చేశారు. దాడి చేసి పది రోజులవుతున్నా ఇసుక మాఫియా సభ్యుల ఆచూకీ దొరకలేదా? అని మండిపడ్డారు. ఇటీవల కప్పలవాగు నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బీఆర్‌ఎస్ నేతలు కర్నె మహేందర్ తదితరులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మహేందర్‌పై ఇసుక మాఫియా కట్టెలు, రాళ్లతో దాడి చేసింది. అయితే, పది రోజులు గడుస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలం కావడంతో బీఆర్‌ఎస్ నేతలు సోమవారం భీమ్‌గల్‌లో ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ముఖ్య నేతల ఒత్తిడితోనే పోలీసులు కేసును నీరుగార్చేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. సీఎం డౌన్‌డౌన్, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. నిందితులను అరెస్టు చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్సై హరిబాబు వచ్చి నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పగా, ఆయన సమాధానంతో సంతృప్తి చెందని నేతలు రాస్తారోకో కొనసాగించారు. దీంతో వారిని పోలీసులు తప్పించే క్రమంలో మాజీ ఎంపీపీ మహేశ్ చొక్కా చిరిగిపోయింది. పోలీసుల తీరును నిరసిస్తూ కార్యకర్తలు మరింత బిగ్గరగా నినాదాలు చేశారు. చివరకు నిందితులను కచ్చితంగా అరెస్టు చేస్తామని ఎస్సై హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మాజీ ఎంపీపీ మహేశ్, మాజీ జడ్పీటీసీ రవి, జడ్పీకో ఆప్షన్ మాజీ సభ్యుడు మోయిజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు నర్సయ్య, లింబాద్రి ప్రసాద్, లింగయ్య, సతీశ్, మాజీ సర్పంచులు సంజీవ్, నర్సయ్య, ప్రవీణ్, సొసైటీ వైస్ చైర్మన్ శోభన్, నాయకులు శర్మనాయక్, శ్రీనివాస్, లింబాద్రి రవి తదితరులు పాల్గొన్నారు



పోలీసులు లాగడంతో చినిగిన చొక్కాను చూపుతున్న మాజీ ఎంపీపీ మహేశ్

## ఎమ్మెల్యే గారు.. రోడ్డు వైపు చూడండి..

### బురద నీటిలో మోకాళ్లపై కూర్చొని యువకుడి నిరసన

బిచ్కుంద, జూలై 29: రోడ్డు మరమ్మతు చేపట్టాలని బిచ్కుంద మండల కేంద్రంలో ఓ యువకుడు వినూత్న నిరసన చేపట్టాడు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు శిలాఫలకాలకే పరిమితమైందని రాజు ముదిరాజ్ బస్టాండ్ వద్ద రోడ్డుపై బురద నీటిలో మోకాళ్లపై కూర్చొని ప్లకార్డు పట్టుకొని నిరసన తెలిపాడు. పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశాడు. పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిండడంతో గుంతలు ఏర్పడక వాహనదారులు కింద పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అధికారిక కార్యక్రమాలకు మండల కేంద్రానికి వస్తున్న ఎమ్మెల్యే.. ఈ రోడ్డు గుండా వెళ్తున్నా సమస్య కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న యువకుడు

### బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన

## ఐటీ హబ్‌పై నిర్లక్ష్యమెందుకు?

### అసెంబ్లీలో గళమెత్తిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వినాయక్‌నగర్, జూలై 29: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.45కోట్లతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఐటీ హబ్ నిర్మించిందని, కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం దాని నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడారు. ఐటీ హబ్‌లో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కడం లేదని అన్నారు. హబ్‌లో 680 సీటింగ్ సామర్థ్యం ఉన్నా సగానికి పైగా ఖాళీలు ఉన్నాయని, అందుకు కారణం ప్రముఖ పేరున్న కంపెనీలు లేకపోవడమేనని, ఈ విషయంలో మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టిసారించి లీడింగ్ కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. తన నియోజకవర్గానికి ఒక్క రూపాయి ఇవ్వలేదని, కొడంగల్‌కు కేటాయించిన నిధుల్లో పదిశాతం ఇచ్చినా నగరం అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించాలని, ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.